# కథ

జయంతి

అనూరాధ వార్ధక్యంలో అడుగు పెట్టింది. గత జీవితంలోని అనుభవాలు స్మృతులుగానైనా వేధించనంత ఆనందంగా ఆమె జీవితం గడిచిపోయింది. అనురాగంగా చూసుకునే అనుకూలమైన భర్త శ్రీనివాసరావు అండలో ఎన్నడూ ఆమె బాధపడ నవసరమే కలుగలేదు.

అటువంటి దీనాడు అకస్మాత్తుగా రాజారావు ఉత్తరం ఆమె కనుల బడేటప్పటికి అలజడి చెందింది. అసలు ఊబుసుపోక భర్త పాతడైరీ తెరిచి చూడకుండా ఉంటే ఆ ఉత్తరం ఆమె చూడటం సంభవించే ఉండేది కాదు.

ఆ డైరీ అయినా ఇప్పటిదా? పదిహేనేళ్ళ నాటిది. ఇంట్లో అటకలపైన సామాను సర్దిస్తూ ఉంటే పాత్ర సామాను, పాతపుస్తకాలతో పాటు ఈ డైరీకూడా బయటపడింది. తోచకా, కుతూహలం అణచుకోలేక డైరీ తెరిస్తే అందులో రాజారావు ఉత్తరం.

'రాజారావు వెధవ. ఎంత సాహసానికి ఒడికట్టాడు. ఏమి వ్రాశాడో ఆయనకి! ఎన్నడూ ఆయన నాతో మాటమాత్రమైనా అనలేదే.

ఒకప్పుడు రాజారావు మాటలు విని ఎంతగా మోసపోయాను! ఉన్నతమైన భావాలు కలవాడనుకున్నాను. విశిష్టమైన వ్యక్తిత్వం అని గౌరవించాను. నాగరాజు అనుకున్న రాజారావు ఆఖరికి వానపామై పోయాడు. ఇంకానయం.'

భగవంతుడు తన్ను రక్షించాడు. లేకుంటే ఏమైఉండేదో — చేతిలో ఉత్తరాన్ని పట్టుకున్న అనూరాధ మనసు పదిహేనేళ్ళ వెనక్కి వెళ్ళి గతాన్ని తలుచుకుంది.

'అనూ, వీడే రాజారావు నా ప్రాణస్నేహితుడు. మన పెళ్ళికి రాలేకపోయాడు' — పెళ్ళయిన కొత్తలలో ఆయన ఒకనాడు అతన్ని ఇంటికి తీసుకు వచ్చి పరిచయం చేశారు.

పేరువిని అనుమానంగానే తలెత్తి

చూసిన నేను ఉలిక్కిపడ్డాను. రాజు... ఆయనకి స్నేహితుడా! ఇది నిజమా!—భయంతోనూ, బాధతోనూ నమస్కరించాను.

'నమస్తే' — రెండు చేతులూ జోడించి ఏమీ ఎరగనట్టుగానే నమస్కారం చేశాడు.

'ఒక్క నిమిషం రాజూ, నేను స్నానం చేసి వస్తాను. నేను వచ్చే దాకా మా ఆవిడ ఎంగేజ్ చేస్తుం దిలే' — నన్ను అక్కడ వదిలేసి ఆయన వెళ్ళారు.

నాకు కాళ్ళూ చేతులూ వణి కాయి. ఏం మాట్లాడాలో తోచ లేదు.

'కూర్చో అనూరాధా' — రాజే మాట్లాడాడు.

మాటలు రానిదానిలాగా వెంటనే సోఫాలో కూలబడ్డాను.

'ఎందుకొచ్చావురాజూ' — నీర సంగా కనులు మూసుకుంటూ అడి గాను.

నాకేమయింది! నా గొంతు నా చెవులకే వింతగా వినపడింది.

రాజు నవ్వాడు. 'నోబుల్ ఇన్ డీడ్. ఇంకా గుర్తు ఉన్నానన్న మాట ఫరవాలేదు.'

నేను మాటాడలేదు. మాట్లాడగల శక్తి నాలో లేదు.

'ఎందుకొచ్చానని కదూ అడి గావు.

నాకేం తెలును, నువ్వే నా సర్వస్వం రాజూ అన్న ఒకనాటి అనూరాధే మా శీనుగాడి భార్య అని.

ఒకవేళ తెలిస్తే మాత్రం ఇలా ఉత్తిచేతులతో వచ్చేవాడిని కాదు. ఏదైనా కానుక తెచ్చేవాడిని.'

అతని మాటలు విని ఊపిరి బిగ బట్టాను. నేను ఏదో అనబోతుంటే,

'ఆగు అనూరాధా, నీ ప్రశ్నకి జవాబిచ్చాను. ఇక నువ్వు నా ప్రశ్నకి జవాబివ్వాలి. ఇచ్చి పుచ్చుకోవటం అన్నారు నన్ను మరిచిపోలేదా? జవాబు చెప్పు' — రాజు అడిగాడు.

'ఎలా మరిచిపోతాను రాజూ'— ఈ మాటలు అంటుంటే నా గుండెల నెవరో నొక్కిపడుతున్నట్లు బాధ ఊపిరి ఆడదేమో అని భయం వేసింది.

రాజు మళ్ళీ పెద్దగా నవ్వాడు.


'నోబుల్ ఇన్ డీడ్. భారత స్త్రీ తన జీవితంలో ఒక్కడినే ఒక్కసారే ప్రేమిస్తుంది. మంచి ఆదర్శం, సిని మాల్లోనూ, నవలల్లోనూ బాగా పని కొస్తుంది.'

'రాజూ ప్లీజ్. మరీ అంత అన్యా యంగా మాట్లాడకు.'

'ఏది అన్యాయం అనూరాధా? అనగా అనగా ఒక అనూరాధ.'

బాధతో నేను రెండు చేతుల తోనూ మొహం కప్పుకున్నాను.

'ఏం? పేరు బాగాలేదా? పోనీ ఎవరో, ఒక సీతో, సావిత్రో, దమ యంతో, — ఒక నిర్భాగ్యుడు, అమా యకుడు, పూర్ ఫెలో అయిన



రాజారావుని ప్రేమించింది. అనూరాధకి బోలెడంత డబ్బు. రాజారావు జేబులో దమ్మిడీలేదు. అతని జేబుకి చిలుటు. దమ్మిడీ లేని వాడికి నా కూతుర్నివ్వను ఫో అంటాడు అనూరాధ నాన్న. ఆ తరువాత ఏమవుతుంది."

"రాజూ ప్లీజ్ స్టాపిట్."

రాజు నా అరువు వినిపించుకోనట్లే కొనసాగించాడు.

"ఆ తరువాత ఏమవుతుంది ?

అనూరాధ ఇంట్లోనుంచి పారిపోయి రాజారావుని పెళ్ళి చేసుకుంటుదా ?

దొడ్లోని గన్నేరుకాయ మింగి చచ్చిపోతుందా ?

రాజారావు పిచ్చివాడయి పాటలు పాడుకుంటాడా ? నో నో నాట్ ఎటాల్. ఇది సినిమాకాదు. జీవితం. అందుకని ఆ అమ్మాయి కాస్తా చక్కగా తలవంచుకుని కూర్చుని అక్షింతలు తెచ్చిన వాడిని పెళ్ళిచేసుకుంటుంది

రాజారావు అనంత విశ్వంలో

తెరవెనుక బడిపోతాడు. దేర్ ఎండ్స్ ది స్టోరి.'

'రాజూ ఎందుకిదంతా? అయినా కథ అక్కడితోనే ఆగిపోలేదుగా. ఈ వేళ ఇలా నా ప్రాణాలకి యముడిలాగా దాపురించావు.'

నాకు విసుగు, అశక్తత లోనుంచి కోపం కలుగుతోంది.

'వెరీగుడ్ సో, కథ పునరావృత్తి అవుతుంది.

నువ్వు లేనిదే నేను బ్రతకలేను అన్న అనూరాధే నా ప్రాణాలకి యముడులాగా దాపరించావు అంటుంది రాజారావుని చూసి. దానికి రాజారా వేమంటాడు?'

ఈ సారి నాకు భయంపోయి ఆ స్థానే కోపం ఆవరించింది. లేచి నిలుచుని 'రాజూ. అసందర్భంగా ప్రవర్తిస్తున్నావు. అవన్నీ మరిచి పో' అన్నాను.

'మరిచిపోనిది నువ్వే అనూరాధా. నే నేనాడో మరచిపోయాను. నీ మొహంలో ఎంత బాధ, నీ మనసులో ఎంత కంగారు వ్యక్తమవుతున్నాయో చూడు. వాటిని నా పెదవులపై చిరునవ్వుతో పోల్చుకో. ఎవరు మరిచిపోలేదో తెలుస్తుంది. ప్లీజ్ కూర్చో.'

నేను అశక్తురాలనయి కూర్చున్నాను.

'నేను నీకోసమేమీ ఏడ్చి బాధపడలేదులే, విచారించకు. అసలు ఇన్నేళ్ళ జీవితంలోనూ నిన్ను విడిచిన తరువాత ఒక్కసారి కూడా తలుచుకోలేదు.

'ఏంచేస్తున్నావు రాజూ. పెళ్ళయిందా' — కుతూహలంగా అడిగాను.

'దివ్యంగా. అదృష్టం బాగుండి బాగా డబ్బున్న రోగిష్టి పిల్లని, మా మావకి ఒక్కతే కూతురుని చేసుకున్నాను. పెళ్ళయిన ఏడాదిలోనే నా శ్రీమతి రత్నం హరీ అంది. సో... ఇప్పుడు రాజారావు జేబుకి చిల్లులేదు, కావలసినంత డబ్బు, మంచి ఉద్యోగం. అందమైన అనూరాధను పెళ్లాడగల అర్హత.'

—అని పెద్దగా నవ్వాడు రాజారావు.


ఆ మాటలలోని కాఠిన్యానికి, అసభ్యతకు నా వళ్ళు జలదరించింది.

'ఈ మనిషినా నేను ప్రేమించింది? ఈ మనిషికోసమా నేను బాధపడుతోంది? ఛీ ఎంత మోసపోయాను! మనిషికాదు మృగం. భగవంతుడు రక్షించాడు. ఇంకా నయం. తండ్రినెదిరించి పెళ్ళిచేసుకోలేదు.'

—నా మనసు మంటలు గ్రక్కింది.

'అనూరాధా. ఒక చిన్న కోరిక. పోనీ ఇప్పుడయినా మించిపోయిందిలేదు. నాతో వచ్చేయకూడదూ. కావలసినంత ధనముంది.'

ఉలిక్కిపడి చూశాను. అతని




పెదవులపై చిరునవ్వు అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.

రాజారావు చెంప ఛెళ్ళుమంది.

'ఛీ. ఇంతనికృష్టుడి వనుకోలేదు. ప్రాణస్నేహితుడివి అనుకుంటున్న ఆయనకు నువ్వు చేయవలసిన ఉపకారమిదేనా. నీనోటితో నా పేరు ఉచ్చరిస్తేనే సర్వపాపాలూ అంటుకుంటాయి. జరిగింది మరిచిపోయి నీ మిత్రుడి భార్యగా చూడగలిగితేనే ఆయన వచ్చేదాకా అయినా ఉండు. లేకుంటే ఇప్పుడే నడు బయటికి.'

నా మాటలు విని రాజారావు వికటంగా నవ్వాడు.

'ఓకే. ఓకే. ఈ కథ ఇంతటితో సమాప్తం. పోనీలే నువ్వు కాకపోతే ఇంకొకరు. ఈ దిక్కుమాలిన దేశంలో ఆడవాళ్ళకేం తక్కువ.'

'ఛీ ... సిగ్గులేదూ' — నేను ఛీత్కారం చేసి లోపలికి వెళ్ళి పోయాను.

వెళుతుంటే అతని నవ్వు కఠోరంగా వినవడింది.

తరువాత ఇక ఆ రోజున ఆయన ముందర రాజారావుతో సభ్యంగా ప్రవర్తించటం చాలా కష్టమయింది.

ఎంత తమాయించుకున్నాగాని రాజారావుని చూస్తేనే చాలు నా మనసు సెగలు పొగలయి అసహ్యాన్ని వెళ్ళగ్రక్కింది.

ముగ్గురం కలసి పేకాడదామన్నారు ఆయన.

నాకు వంట్లో బాగుండలేదు, ఆడనన్నాను.

భోజనాల దగ్గర, ఆయన చెయ్యి కడుక్కోవటానికి వెళ్ళినపుడు మాత్రం - 'రాజా, ఇంకెప్పుడూ మా ఇంటికి రాకు. జన్మలో నీ దౌర్భాగ్యపు మొహం తిరిగి నాకు చూపించకు. నీ జ్ఞాపకాల నీడ కూడా నా మీద పడనివ్వకు. నువ్వంటే నాకు మిగిలింది అసహ్యమే - అన్నాను నిర్మొహమాటంగా.

రాజారావు జవాబివ్వలేదు. నవ్వాడు. ఆ నవ్వు విని వళ్ళు మండిపోయింది.

భోజనాలు అయిపోగానే, తలకాయ నెప్పిగా ఉందని పోయి పడుకున్నాను.

'అనూ ... లే ... అతను వెళుతున్నాడు. ఏమిటిది? ఏమైనా బాగుందా' - ఆయన వచ్చి బ్రతిమాలారు.

'నేను లేవలేను. వెళ్ళిరమ్మనండి' - కఠినంగా చెప్పాను.

'ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తావనుకోలేదు' - ఆయన విసుక్కున్నారు.


## ఉదరాంతకి

చంటి పిల్లల సమస్త అనాసలు, లివర్ అండ్ ప్లీన్సు వ్యాధులు నివారించి ఆరోగ్యవంతులుగా చేయును.

## అమృత సంజీవినీమాత్రలు

గర్భిణీ స్త్రీలకు కలుగు సమస్త వ్యాధుల పోగొట్టి తల్లికి, గర్భస్థ శిశువునకు బలము కలిగించి సుఖప్రసవము, సత్సాంతానము కలుగజేయును.

## శ్రీ భుజంగరాడ్వైద్యశాల

ప్రొప్రయిటర్సు "భిషక్ శిరోమణి" పొన్నాడ పేరయ్య అండ్ సన్సు

తాళ్ళరేవు, తూర్పుగోదావరిజిల్లా.

"ఫరవాలేదులేరా. మీ ఆవిడ లేచి రాలేకపోయినంత మాత్రాన కొంపేం మునిగిపోదులే నేను వెళుతున్నాను" – నవ్వుతూ రాజు అన్న మాటలలో నన్ను ఎగతాళి చేస్తున్నట్లు అనిపించింది.

లేచి చెప్పు తీసుకు కొడదామనుకున్నాను

*   *   *

గతాన్ని గుర్తుజేసుకున్న అనూరాధ కోపంతో ఊగింది. నిట్టూర్పు విడిచి అనుకుంది.

భగవంతుడి దయవలన రాజు మళ్ళీ కనిపించలేదు. అదే ఆఖరు సారి చూడటం.

ఆ తరువాత ఆయనవచ్చి "రాజు ఉద్యోగానికి రిజైన్ చేశాడుట. అసలు బదిలీ చేయించుకుందామని ప్రయత్నించాడుట. అది వీలుపడకపోతే ఉద్యోగమే వదిలేసి ఊరు విడచి వెళ్ళిపోయాడుట. వెళ్ళే ముందు చెప్పైనా వెళ్ళలేదు" అని భర్త బాధపడుతుంటే అనూరాధ ఓదార్చే ప్రయత్నమే చేయలేదు. విననట్టు ఊరుకుంది.

అంతకన్నా, అయిదేళ్ళ క్రితం – "రాజు చచ్చిపోయాడుట అనూ. ఎవరూ లేనిచోట దిక్కులేని చావు చచ్చాడుట, ఆశ్చర్యంగా లేదూ."

అని తన మొహంలోకి సూటిగా చూసి భర్త అడిగితే ఆమె నిర్వికారంగా ఉండిపోయింది.

ఆరేళ్ళ కుర్రాడు కాలవ గటున ఆడుకుంటూ కాలుజారి నీళ్ళలోకి పోయాడు. దారిన పోయే దానయ్య వాడిని బయటకి తీసి, తండ్రి పేరు, అడ్రసు కనుక్కుని ఇంటికి తీసుకెళ్ళాడు.

"నువ్వేనా మా వాణ్ణి కాలవలోంచి తీసింది?" అని కుర్రాడి తండ్రి అడిగాడు.

"ఫర్లేదండి. దానికేముంది? ఏదో చిన్న పిల్లాడు మునిగిపోతుంటే తీసిరక్షించడంకూడా గొప్పేనా?" అన్నాడు దానయ్య.

"ఫర్లేదేమిటయ్యా? వాడి జేబులో అర్థరూపాయి వుండాలి. ఏదీ?" అని తండ్రి గద్దించాడు.

రాజారావు చావుకి కొంచెమైనా బాధ పడలేదు.

"ఎటువంటి మనుషులకి అటువంటి చావు లభిస్తుంది" – అనుకున్నది మనసులో.

కానీ అన్నిటికన్నా అనూరాధను బాధించిన విషయం, భర్త తన మాట వినకుండా ఒక్కగానొక్క కూతురికి పేరు పెట్టటమే.

"మా రాజు జ్ఞాపకార్థం దీనికి రాజేశ్వరి అని పేరుపెడతాను" అని భర్త అంటే, అనూరాధ వద్దంది,

ప్రతిమాలింది, భయపెట్టింది, కోప గించుకుంది, భంగపడింది.

భర్త ఆమె మాట వినలేదు.

అందుకే అనూరాధ కూతురుని ఎప్పుడూ పేరు పెట్టి పిలవదు. "అమ్మాయీ" అనే పిలుస్తుంది

అది గుర్తుకు వచ్చి "ఛీ... పాడు పేరు. ఆ పేరువిన్నా నాకసహ్యమే" అనుకుంది.

ఆలోచనలతో మునిగిపోయిన ఆమె చేతిలోని ఉత్తరం గాలికెగిరి కిందపడింది.

అనూరాధవంగి ఆ ఉత్తరాన్ని అందుకుంటూ విసుక్కుంది.

"ఇందులో ఏం వ్రాశాడో ఆ దుర్మార్గుడు" అనుకుంటూ కళ్ళ జోడు సవరించుకుని చదివింది."

"శీనూ,

---




చెప్పకుండా ఊరినుంచి వెళ్ళిపో తున్నందుకు నువ్వు బాధపడతావని తెలుసు. అందుకు క్షమించాలి. నేను బ్రతికున్నంతకాలం నా ఉనికి నీకు తెలియనివ్వను. చావు కబురు మాత్రం నీకు తప్పక అందేటట్లు చూస్తాను. ఇక ఈ ఉత్తరంలో నేను వ్రాయబోయే విషయం నువ్వు బ్రతికున్నంతకాలం నీలోనే ఉంచుకుంటా నని, నీ భార్యకి తెలియనివ్వకని నాకు మాట ఇచ్చినట్లుగా భావించి చదువు.

నీకు తెలియదేమో. నేనూ రాధా ఒకానొకరోజుల్లో ప్రేమించుకున్నాం. పెద్దలు మా వివాహానికి అనుమతించకపోతే, అనూరాధ నిన్ను చేసుకుంది. అనూరాధే నీ భార్య అని మీ ఇంటికి వచ్చేదాకా నాకు తెలియదు. తెలిస్తే వచ్చేవాడినిగాను. ఆడవాళ్ళు సెంటిమెంటల్ ఫూల్స్ అపాత్రమైన విషయాలకు ప్రాముఖ్యతనిచ్చి జీవితాన్ని విషాదం చేసుకుంటారు. అనూరాధ నన్ను మరిచిపోలేదని, పాతజీవితాన్ని మరచిపోలేక, కొత్త జీవితాన్ని కాదనలేక సంఘర్షణలో నలిగిపోతుండటం చూశాను.

మైడియర్ శీనూ, దానికి ఒకటే మందు.

అప్పటిదాకా 'దేవదానూ, మజ్నూలాగా ఆమె మనోవీధిలో మెదిలే రాజారావు దుష్టుడు, దుందుభి, దుశ్శాసనుడు అయిపోవాలి. అందుకే ఆరోజున నువ్వు లేనప్పుడు మీ ఆవిడ దగ్గర నేను ఒక చిన్నసైజు విలనులాగా ప్రవర్తించాల్సి వచ్చింది.

ఎవరైనా తనను నిర్లక్ష్యంచేసి, లోకువ కడితే ఆడవాని అహం దెబ్బ తింటుంది. ఆ పని చేసిన మగవాడిని ఆమె ఎన్నటికీ క్షమించలేదు. అదే నేను చేసింది. అందుకే అనూరాధ నన్ను ఇకపై జీవితాంతం ద్వేషిస్తుంది. నీకు నిజమైన భార్య దొరుకుతుంది అదే నాకు కావలసింది! అందుకే వెళ్ళిపోతున్నాను.

నా చావుకబురు విన్నపుడు మాత్రం ఈ రెండు మాటలు నన్ను గురించి అనుకో.

ఇల్లు శుభ్రంగా వుండాలంటే ఇంట్లో ఒక చెత్తకాగితాల బుట్ట, మాసిన బట్టలపెట్టె ఎంతఅవసరమో కొందరి జీవితాలు గందరగోళం లేకుండా ఉండాలంటే ఆ సంఘర్షణ ఇంకొకరు భరించటమూ అవసరమే. అందుకని—

అనురాగానికన్నా జీవితంలో ధర్మం ముఖ్యమని విలనయ్యాడు హీరో రాజారావు.

శోలాంగ్ మైడియర్
రాజు

పరా: ఇంట్లో వేస్టు పేపర్ బాస్కెట్ చూసినప్పుడల్లా నన్ను గుర్తుకు తెచ్చుకో.'

ఉత్తరం పూర్తిగా చదివిన అనూరాధ నిశ్చేష్ట అయింది.

□□□